ఇరుకు గదిలో విధులు

- ఇబ్బంది పడుతున్న క్రైం పోలీసులు
- మరుగుదొడ్లకు నోచుకోని వైనం


చిన్న గదిలో నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్

సీతమ్మధార: ఇరుకు గదిలో ఇబ్బంది పడుతూ ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. క్రైం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐతోపాటు 16 మంది సిబ్బంది, ఇందులో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. స్టేషన్ ఒకే గది కావడంతో సిబ్బంది విధులకు ఇబ్బందికరంగా మారింది. సబ్ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్, హెచ్‌సీలు, సిబ్బందితోపాటు బీరువాలు, రికవరీ సామగ్రి చిన్న గదిలోనే ఉంటాయి. ఫిర్యాదుదారులు వస్తే గది సరిపోక పోవడంతో సిబ్బంది బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. పలు దొంగతనం కేసుల్లో అనుమానితులను స్టేషన్‌కు తీసుకువస్తే విచారణకు కష్టంగా మారింది. ఇక్కడ మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా పోలీసులు స్టేషన్ ఎదురుగా ఉన్న ఆస్పత్రిలోని బాత్‌రూమ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వారం రోజుల కిందట ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో స్టేషన్‌పై చెట్టు కొమ్మలు కూలిపోయి సిమెంట్ రేకులు విరిగిపోయాయి. దీంతో ప్లాస్టిక్ కవర్లు ఏర్పాటు చేసుకున్నారు. స్టేషన్‌లో సమస్యల పరిష్కారానికి పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ట్రిపుల్‌ఐటీకి ఎంపిక


చింతపల్లి భరత్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన చింతపల్లి భరత్ నూజివీడు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యాడు. టెన్త్‌లో 586 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా శుక్రవారం భరత్‌ను స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనరస, సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వాకర్స్ సభా ప్రాంగణం ప్రారంభం రేపు

మురళీనగర్: స్థానిక వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సభా ప్రాంగణాన్ని ఆదివారం ప్రారంభిస్తామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న ప్రాంగణాన్ని మరింత విస్తరించి ఆధునికంగా తీర్చిదిద్దారు. దీన్ని శనివారం నుంచి వాకర్స్, సందర్శకులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఈ సందర్భంగా రాత్రి 7 గంటలకు 'పుటుక్కు జర..జర..డుబుక్కు మే' హాస్య నాటిక ప్రదర్శన ఉంటుందని, వాకర్స్ సభ్యులు పాల్గొని తిలకించాలని వారు కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై జీవీఎంసీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలాదీపిక పాల్గొని మలేరియా, డెంగ్యూ వ్యాధుల వ్యాప్తి, వాటి నివారణ మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, బీజేపీ వార్డు అధ్యక్షుడు కూన వెంకటరమణ, జనసేన వార్డు అధ్యక్షుడు సనపల శివసాగర్, టీడీపీ మహిళా అధ్యక్షురాలు పైడి పుణ్యవతి, జీవీఎంసీ హెల్త్ ఇన్‌స్పెక్టర్, వెల్ఫేర్, హెల్త్ సెక్రటరీలు, ఆర్పీలు, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

సీతమ్మధార: ఈ నెల 14న సీతమ్మధార గాంధీనగర్‌లోని డాక్టర్ రహమతుల్లా ఆస్పత్రి వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రహమతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఎబాట్, టోరెంట్, ఫ్రాంకో ఇండియన్ ఫార్మా కంపెనీల సహకారంతో ఆదివారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. బీఎండీ, థైరాయిడ్, బ్లడ్ సుగర్, యూరిక్ యాసిడ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. స్థానికులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన..
కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తు లు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


విద్యార్థి ఉప్పాల ప్రతీక్‌కు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న ఎస్ఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయులు


అభినందన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార: నూజివీడు ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ సీటు సాధించిన పీఅండ్‌టీ కాలనీ ఎస్ఎంసీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి ఉప్పాల ప్రతీక్‌ను ఘనంగా సత్కరించారు. పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు డి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో ప్రతీక్‌కు రూ.6 వేల ప్రోత్సాహక నగదు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఉప్పాల ప్రతీక్ టెన్త్‌లో 580/600 మార్కులతో సత్తా చాటాడన్నారు. ప్రతిష్టాత్మకమైన నూజివీడు రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ–ఐఐఐటీలో తమ విద్యార్థికి సీటు రావడంతో ఎస్ఎంసీ హైస్కూల్ ప్రతిష్ట మరింత పెరిగిందన్నారు. ప్రతీక్ తన జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తమ పాఠశాల నుంచి 2018లో ఎ.సైమన్ నూజివీడులో, 2021లో అఖిల శ్రీకాకుళంలో, 2022లో ఐయిషిత శ్రీకాకుళం ఐఐఐటీల్లో సీట్లు సంపాదించారని కొనియాడారు. అక్కడి విద్యార్థులకు ఇంటర్‌తో పాటు ఇంజినీరింగ్ చదువు ఉచితంగా అందిస్తారని చెప్పారు. విద్యార్థులంతా వీరిని ఆదర్శంగా తీసుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని హెచ్‌ఎం రాంప్రసాద్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


రైల్వేస్టేషన్ వద్ద ర్యాలీలో పాల్గొన్న శ్రామిక్ నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు

తాటిచెట్లపాలెం: ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్) పిలుపు మేరకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ జరిగింది. విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, యూనియన్ నాయకులు హాజరై.. నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ కో–ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు మాట్లాడుతూ ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ నాయకులు శివగోపాల్ మిశ్రా నాయకత్వంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కె.పట్నహాని నాయకత్వంలో రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. పోరాటాల ఫలితంగా పాత పెన్షన్ విధానాన్ని త్వరలోనే పునరుద్ధరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐఆర్ఎఫ్ జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల కార్మికులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం దిగిరాకుంటే 1972లో చేసిన విధంగా సమ్మె చేసేందుకు సిద్ధమన్నారు. ర్యాలీ అనంతరం ప్రధాని మోదీకి రాసిన వినతిపత్రాన్ని వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు అందజేసి.. ప్రధానికి పంపాలని కోరారు. జోనల్ అధ్యక్షుడు పి.వి.జి.రాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి


ప్రేమ సమాజంలో చిన్నారితో మాట్లాడుతున్న వెంకట శేషమ్మ

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. శుక్రవారం దాబాగార్డెన్స్ ప్రేమ సమాజం, మెంటల్ కేర్ ఆస్పత్రిలో ఆమె పర్యటించి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీడీఎం కోర్టు జడ్జి జి.స్వర్ణ, ఎండీఎం కోర్టు జడ్జి సూర్యకళ తదితరులు పాల్గొన్నారు. ప్రేమ సమాజంలో ఉన్న వృద్ధులు, పిల్లలతో వెంకట శేషమ్మ మాట్లాడి వసతి, భోజన సదుపాయాలపై ఆరా తీసి పలు సూచనలిచ్చారు. సాగర్‌నగర్ అంధుల పాఠశాలను సందర్శించి అక్కడ పిల్లలకు వసతి, భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన
దాబాగార్డెన్స్: హెల్మెట్ ధారణ.. హెల్మెట్ ఆవశ్యకతపై శుక్రవారం ద్వారకా బస్ స్టేషన్‌లో విశాఖ జిల్లా న్యాయ సేవా అథారిటీ నేతృత్వంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి వెంకట శేషమ్మ హెల్మెట్ వాడకం ఆవశ్యకత గురించి తెలిపారు. గతేడాది 4,700 యాక్సిడెంట్లు జరిగితే అందులో 4,100 ప్రమాదాలకు ప్రధాన కారణం హెల్మెట్ సరిగ్గా వినియోగించకపోవడమే అని చెప్పారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను 3 నెలల పాటు రద్దవుతుందన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు అన్ని ఆర్టీసీ డిపోల్లో నిర్వహిస్తామని తెలిపారు.

స్టాప్ డయేరియాపై అవగాహన ఉండాలి


ఇసుకతోట ఏరియాలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పర్యటించారు. ఇసుకతోట రామాలయం వీధి పరిసర ప్రాంతాల్లో పర్యటించి పలు సూచనలు చేశారు. స్టాప్ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు డీఎంహెచ్‌వో సూచించారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ఇంట్లోని ఫ్రిజ్ వెనక ఉండే నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు. రక్తహీనత నివారణ కోసం గర్భిణులను గుర్తించి ఐరన్ మాత్రలు అందజేయాలని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు డీఎంహెచ్‌వో సూచించారు.

శాకంబరిగా వారాహి మాత



అల్లిపురం: అల్లిపురంలోని శ్రీ షిర్డీ సాయి దర్బార్‌లో వెలసిన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏడవ రోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వారాహి అమ్మవారిని కాయగూరలతో శాకంబరీ దేవిగా అలంకరించారు. దీంట్లో భాగంగా మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని వారాహి స్తోత్రంతో కీర్తించారు. ఒకరికొకరు తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు శ్రీతిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి వెంకయ్యనాయుడు

అక్కిరెడ్డిపాలెం: మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి శనివారం ఉదయం 6 గంటలకు విచ్చేయనున్నట్లు దివ్యక్షేత్రం ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని దివ్యక్షేత్రం ప్రతినిధులు తెలిపారు. వెంకయ్యనాయుడుకు ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ స్వాగతం పలకనున్నట్లు తెలిపారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

గంజాయి కేసులో మరో వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార: గంజాయి కేసులో మరో వ్యక్తిని శుక్రవారం ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఇటీవల విశాఖ రైల్వే స్టేషన్ బయట తనిఖీలు జరుగుతున్న సమయంలో రెండు సంచులతో 21 కిలోల గంజాయి దొరికింది. అందులో నలుగురి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఇద్దరు నిందుతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా మరో వ్యక్తి బెంగుళూరుకు చెందిన సుధాకర్‌ను అరెస్ట్ చేశారు. మిగిలిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: పలు రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతో.. ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరే రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 6.20 గంటలకు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు బయలుదేరింది.

వివాహిత అదృశ్యం


ఎస్.భవాని

అల్లిపురం: తన భార్య కనిపించడం లేదని అల్లిపురం, గాంధీబొమ్మ జంక్షన్‌కు చెందిన ఎస్.సురేష్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలివీ.. గత ఏడాది డిసెంబర్ 24న సురేష్ పనికి వెళ్లారు. రాత్రి ఇంటికి చేరుకోగా అతని భార్య ఎస్.భవాని కనిపించలేదు. ఆమె సెల్‌ఫోన్ ఇంట్లోనే ఉంది. అప్పటి నుంచి నగరం, బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో ఆయన శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 92941 06386, 94409 04716కు తెలియజేయాలని సీఐ కోరారు.

గోశాలలో ఘనంగా వన మహోత్సవం


వనమహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శుక్రవారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సంపెంగ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం దేవస్థానం అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మొక్కలను పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దేవస్థానం గోశాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు సంరక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రాజేంద్రకుమార్, నరసింహరాజు, ఏఈ హరిరాజు, సూపరింటెండెంట్లు యనమండ్ర అప్పారావు, గాయత్రి పాల్గొన్నారు.

రైతుబజార్లలో బియ్యం, కందిపప్పు విక్రయాలు


సీతమ్మధార రైతుబజార్‌లో వినియోగదారులకు కందిపప్పు అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సీతమ్మధార రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు స్పెషల్ కౌంటర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతమ్మధార రైతుబజార్‌లో మరో రెండంతస్తుల నిర్మాణానికి గానూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో చర్చిస్తానని తెలిపారు. ప్రత్యేక కౌంటర్లలో సబ్సిడీపై కిలో కందిపప్పు రూ.160, స్టీమ్డ్ బీపీటీ రైస్ కిలో రూ.49 చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. తద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కొందరు రైతులు తమ అద్దెలు రద్దు చేయాలని కోరగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతుబజార్‌లో తొలి రోజు 13 బ్యాగుల బియ్యం, 130 కిలోల కందిపప్పు విక్రయించారు. కార్యక్రమంలో బీజేపీ ఉత్తర ఇన్‌చార్జి సురేష్, 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, టీడీపీ వార్డు అధ్యక్షురాలు బర్ల పద్మలత, టీడీపీ నాయకుడు గన్ని వీరన్న చౌదరి, డీఎస్‌వో ప్రకాష్‌రావు, బీజేపీ నాయకుడు నానిరెడ్డి, జనసేన నాయకులు, రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్, వినియోగదారులు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

నరసింహనగర్ రైతుబజార్‌లో..
సీతంపేట: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న సన్న బియ్యం, కందిపప్పు ప్రత్యేక కౌంటర్‌ను శుక్రవారం ఉదయం నరసింహనగర్ రైతుబజార్‌లో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకుతో కలిసి ప్రారంభించారు. బీపీటీ సోనా మసూరి బియ్యం కిలో రూ.49కు, దేశవాళి కందిపప్పు కిలో రూ.160కు సబ్సిడీపై విక్రయించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.మురళీకృష్ణ, రైతుబజారు ఈవో పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

కంచరపాలెం రైతుబజారులో..
కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం రైతుబజారులో సబ్సిడీపై కందిపప్పు, రైస్ విక్రయాల స్పెషల్ కౌంటర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. రైతుబజారులో వినియోగదారులకు ఎటువంటి సమస్యలు ఉన్నా.. తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చల్లా రజిని, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.మురళీనాథ్, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ నగేష్, రైతుబజార్ ఈవో సిహెచ్.కృష్ణమూర్తి, అటెండర్ ఎం.దిలీప్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డోలు కళాకారుడు గోవిందరావుకు సత్కారం


గోవిందరావు దంపతులను సత్కరిస్తున్న ఎం.వి.రాజశేఖర్, సంఘ సభ్యులు

సీతంపేట: విశాఖ నగర శ్రీమారుతి నాయీ బ్రాహ్మణ డోలు, సన్నాయి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డోలు వాయిద్యంలో ఆల్ ఇండియా రేడియో ద్వారా ఏ టాప్ గ్రేడ్ పొందిన కళాకారుడు కె.గోవిందరావును శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ ఏ కళాకారుడైన తను ఎంపిక చేసకున్న కళలో రాణించాలంటే దీక్ష, పట్టుదల, కృషితోనే సాధ్యమవుతుందన్నారు. కె.గోవిందరావు దంపతులను ఘనంగా సత్కరించి అభినందించారు. సాటి కళాకారుని ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేలా సత్కార కార్యక్రమాన్ని నిర్వహించిన సంక్షేమ సంఘం సభ్యులను ప్రశంసించారు. కార్యక్రమంలో జి.శ్రీమన్నారాయణ, సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.భీమారావు, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి బాలరాజు, మెలోడి క్రియేటర్స్ అధ్యక్షులు సిహెచ్.వి.సత్యనారాయణ, సంక్షేమ సంఘం సభ్యులు, నాదశ్వర డోలు కళాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి 33/11 కేవీ ఇండస్ట్రియల్ ఎస్టేట్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియా, మర్రిపాలెం, గవర్నమెంట్ ఐటీఐ, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, జ్యోతినగర్, గౌతమి గార్డెన్స్, హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్, సంకురుపేట, శ్రీరామ్‌నగర్, లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్స్, బర్మా క్యాంప్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఎస్ఎస్‌టీఎల్ సబ్ స్టేషన్ పరిధిలో..
మర్రిపాలెం: జోన్–2 ఎస్ఎస్‌టీఎల్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మాధవధార వుడా కాలనీ, మాధవధార ఆర్టీవో ఆఫీస్ ఏరియా, శాంతి ల్యాండ్‌మార్క్, సాయినగర్, లక్ష్మీనగర్, పార్వతీనగర్, కేఎస్ఆర్ గ్రీన్ వ్యాలీ అపార్ట్‌మెంట్, అంబేద్కర్ కాలనీ, మర్రిపాలెం వుడా లేఅవుట్, శాంతినగర్ అంబేద్కర్ కాలనీ, పీఎఫ్ ఆఫీస్, అయ్యప్పనగర్, వంశీనగర్, రాజీవ్‌నగర్, జీఐఎస్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతుడు గంట్రేడి నూకరాజు (ఫైల్)

భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేట సమీపంలో శక్రవారం ఉదయం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ బలంగా ఢీ కొనడంతో డ్రైవర్ గంట్రేడి నూరాజు(36) మృతి చెందగా, క్లీనర్ ఏనుగుల రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాపట్నం జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన నూకరాజు డ్రైవర్‌గా, అసరపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల రాము క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ లారీలో బిస్కెట్ ప్యాకెట్లను లోడు చేసుకుని సబ్బవరం నుంచి ఒడిశా బయలుదేరారు. సుందరపేట జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి అప్పటికే టైర్ పగిలి రహదారిపై నిలిచిపోయిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. భోగాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నూకరాజు మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి, తీవ్ర గాయాల పాలైన రామును విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు గంట్రేడి వెంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లను సన్మార్గంలో నడపాలి


మాట్లాడుతున్న ఏయూ ఆర్ట్స్, కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావు

మహారాణిపేట : జాతీయ సేవా పథక ప్రోగ్రామ్ అధికారులు వలంటీర్లను సన్మార్గంలో నడపాలని, సోషల్ మీడియాకు వారు బానిసలు కాకుండా చూడాలని ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథక సెమినార్ హాల్లో విజయనగరం, ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రొగ్రామ్ అధికారుల ఒక రోజు శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దోమలపై దండయాత్ర, స్వీప్, ముఖ్యమైన దినోత్సవాల నిర్వహణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగించడం తదితర కార్యక్రమాల్లో జాతీయ సేవా పథక వలంటీర్ల పాత్ర మరువలేనిదన్నారు. వలంటీర్లు ఓటర్లను జాగృత పరచడం వల్లే ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జాతీయ సేవా పథక ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత కార్యక్రమాల్లో రక్తదానం, జాతీయ, అంతర్జాతీయ యువజన కార్యక్రమాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయ వలంటీర్లు ముందున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథక విశాఖ జిల్లా ప్రొగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, విజయనగరం జిల్లా ప్రొగ్రామ్ అధికారి జి.చంద్రశేఖర్ ప్రసంగించారు.